స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఈవీఎంలు భద్రం

పరిగిలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ చేసిన అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారి విజయకుమారి, వివిధ పార్టీల ప్రతినిధులు

పరిగి, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అనంతరం పరిగిలోని మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. పరిగి మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో శుక్రవారం జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్క్రూటినీ నిర్వహించి స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచి సీల్ వేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి, సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాశ్, సుధాకర్ జయక్జోలతోపాటు నాలుగు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, విజయకుమారి, శ్రీనివాసరావు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

శివగంగ ఆలయంలో కార్తిక మాస పూజలు

రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు

మహేశ్వరం, డిసెంబర్ 1: మహేశ్వరంలో ప్రసిద్ధి గాంచిన శివగంగ ఆలయంలో కార్తిక మాసంలో భాగంగా లక్ష దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఈవో మురళీకృష్ణ అన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో రోజుకు 3,500 దీపాలను వెలిగిస్తామన్నారు. నెల రోజుల పాటు లక్ష దీపాలను వెలిగించనున్నట్లు వారు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ క్యాథ్లిన్‌కు ఆహ్వానం

డాక్టర్ వీజేఈ క్యాథ్లిన్

వనస్థలిపురం, డిసెంబర్ 1 : యూనివర్సిటీ ఆఫ్ దుబాయ్ నిర్వహించనున్న ఐఈఈఈ గ్రీన్‌టెక్ సదస్సుకు టీకేఆర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వీజేఈ క్యాథ్లిన్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 5 నుంచి 12 వరకు దుబాయ్‌లో జరగనున్న ఈ సింపోసియంలో 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, స్లమ్స్' అనే అంశంపై ఆమె ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పాల్గొనే ఈ సదస్సులో తనకు అవకాశం దక్కడంపై సంతోషంగా ఉందన్నారు.

5 నుంచి ధారూరు మెథడిస్ట్ జాతర ఉత్సవాలు

ధారూరు మెథడిస్ట్ జాతర ప్రాంగణం

ధారూరు, డిసెంబర్ 1 : ధారూరు మెథడిస్ట్ ఇండియా జాతర ఉత్సవాలు ఈ నెల 5నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గత 101 ఏండ్లుగా క్రిస్టియన్ మెథడిస్ట్ జాతర ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఏడాది నవంబర్‌లో జరిగే ఉత్సవాలకు యాత్రికులు లక్షలాదిగా తరలివస్తారు. అయితే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు ఉండడంతో ఈ ఉత్సవాలను డిసెంబర్ 6 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పునీతులవుతారనే నానుడి ఉంది. సుమారు 10 దశాబ్దాలుగా ధారూరు మండలంలోని స్టేషన్ ధారూరు, దోర్నాల్ గ్రామాల మధ్యన ఉన్న కాగ్నా నది ఒడ్డున మెథడిస్ట్ జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

లైఫ్‌స్టయిల్ వస్త్ర ప్రదర్శనలో అవికా గోర్ సందడి

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : బంజారాహిల్స్‌లో స్వాన్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ వస్త్ర ప్రదర్శనను హీరోయిన్ అవికా గోర్ శుక్రవారం ప్రారంభించి సందడి చేసింది. ఔత్సాహిక మహిళా ఫ్యాషన్ డిజైనర్లు, మహిళా పారిశ్రామిక వార్తలు, సంప్రదాయ చేనేత చీరలు, లైఫ్ స్టయిల్ ఉపకరణాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. శనివారం రాత్రి వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు అంజలి రెడ్డి, స్వాతి వేముల తెలిపారు.

ఓటెత్తిన మహిళలు

- వికారాబాద్ జిల్లాలో మహిళా ఓటర్ల చైతన్యం
- నాలుగు నియోజకవర్గాల్లో పోలైన 3,69,420 మహిళా ఓట్లు
- గత ఎన్నికలతో పోలిస్తే 48,656 ఓట్లు అధికంగా పోల్
- అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో 98,466 వనితల ఓట్లు
- తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో.. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- తాండూరులో 97,963 మంది, కొడంగల్‌లో 97,537 ఓటు హక్కును వినియోగించుకున్న మహిళామణులు

పెద్దేముల్‌లో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు (ఫైల్)

వికారాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీకి గురువారం జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని మహిళా ఓటర్లు చైతన్యం ప్రదర్శించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో జిల్లాలో మహిళా ఓటర్లే అధిక్యత ప్రదర్శించారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేంత వరకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో భారీ క్యూ ఉన్నప్పటికీ ఓపికతో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ తమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే మంచి నేతను ఎన్నుకోవడంలో తామేందుకు భాగస్వాములు కావొద్దనే అభిప్రాయంతో వారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం మహిళా ఓటర్లను చైతన్యవంతులను చేసేందుకు ఊరూరా చేసిన అవగాహన కార్యక్రమాలు కూడా సత్ఫలితాలనిచ్చాయి. ఈ ఎన్నికల్లో మహిళలు ఇంటికే పరిమితం కాకుండా ఓటు వేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. దేనిలోనూ మేమూ తక్కువ కాదనేలా ఏ ప్రలోభాలకు లొంగకుండా ఓపికగా క్యూలో నిల్చుని అభివృద్ధి చేసే వారికే మా ఓటంటూ ఓటెత్తారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చేలా మారిన పరిస్థితి నెలకొంది.

మహిళా ఓటర్లే కీలకం...

ఏ ఎన్నికలు జరిగినా... మహిళా ఓటర్లే కీలకంగా మారుతున్నారు. గతంలో ఓటు వేసేందుకు అంతగా ఆసక్తి చూపని మహిళలు ప్రస్తుతం స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. ఒకప్పుడు 30 నుంచి 35 శాతానికి మించని మహిళా ఓటింగ్ శాతం ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో అయితే వందకు వంద శాతం మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా గిరిజన తండాల్లో అయితే మహిళా ఓటర్లలో చాలా చైతన్యం వచ్చింది. మహిళలు గుడ్డిగా ఓటేసే రోజులకు కూడా చరమగీతం పాడారు. ఇప్పుడంతా మా ఊరికేం చేశారు.. మనకేం చేశారని ఆలోచించి ఓటేసేలా మహిళలు చైతన్యవంతులయ్యారు.

నియోజకవర్గాల వారీగా..

ఈ ఎన్నికల్లో జిల్లాలోని తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఆధిక్యత ప్రదర్శించారు. సంబంధిత రెండు నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓట్లే అధికంగా పోలు కావడం గమనార్హం. అయితే ఈ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో మొత్తం 2,59,422 ఓట్లు పోల్ కాగా.. 98,466 మహిళా ఓట్లు, 1,00,519 పురుషుల ఓట్లు పోలయ్యాయి. వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,28,253 ఓట్లు పోలు కాగా.. 85,454 మహిళా ఓట్లు, 87,026 పురుషుల ఓట్లు పోలయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో మొత్తం 2,36,076 ఓట్లు పోలయ్యాయి. వీరిలో 87,963 మహిళా ఓట్లు, 86,038 పురుషుల ఓట్లు పోలయ్యాయి. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,36,625 ఓట్లు పోల్ కాగా.. 97,537 మహిళలు, 96,403 పురుషుల ఓట్లు పోలయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో పురుషుల కంటే 1,925 మంది మహిళా ఓట్లు అధికంగా పోలయ్యాయి, కొడంగల్ నియోజకవర్గంలోనూ పురుషుల కంటే 1,134 మంది మహిళా ఓట్లు అధికంగా పోలయినట్లు అధికారులు వెల్లడించారు.

పెరిగిన ఓటింగ్ శాతం

జిల్లాలో 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా ఎన్నికల్లో 48,656 మంది మహిళా ఓట్లు అధికంగా పోలైనట్లు జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు. గత ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల్లో పోలైన మహిళా ఓట్లు 3,20,764 ఓట్లు కాగా ఈసారి ఎన్నికల్లో 3,69,420 మహిళా ఓట్లు పోలయ్యాయి. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం గత ఎన్నికల్లో మహిళా ఓట్లు పోలైన శాతం 49.66 శాతం కాగా, ఈసారి ఎన్నికల్లో 76.51 శాతం మహిళా ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో మహిళా ఓట్లు 26 శాతం మేర పెరగడం గమనార్హం. ప్రధానంగా ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో మహిళా ఓట్లు పోలయ్యాయి.

వికారాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	శాతం
పరిగి	2,59,422	1,31,163	1,28,250	9	1,96,986	1,00,519	98,466	1	76.70
వికారాబాద్	2,28,253	1,13,919	1,14,321	13	1,72,486	87,026	85,454	6	75.57
తాండూరు	2,36,076	1,15,143	1,20,927	6	1,74,002	86,038	87,963	1	73.71
కొడంగల్	2,36,625	1,17,303	1,19,310	12	1,93,940	96,403	97,537	0	81.96
మొత్తం	9,60,376	4,77,528	4,82,808	40	7,39,414	3,69,986	3,69,420	8	76.99

గృహ రుణాలు వినియోగించుకోండి

మాదాపూర్, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌కు ఎటువంటి ఢోకా లేదని, ఎల్లప్పుడు పెరుగుతూనే ఉంటుందని క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి విచ్చేసి ఎస్‌బీఐ సీజీఎం హైదరాబాద్ సర్కిల్ రాజేశ్ కుమార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్, ముంబాయి సీజీఎం ఉషా గౌతమ్‌తో పాటు ఎన్‌డబ్ల్యూ జనరల్ మేనేజర్ హైదరాబాద్ డెబాషిష్ మిశ్రా, హైదరాబాద్ డీజీఎం రవీంద్ర హిట్నాల్లి,నారెడ్కో అధ్యక్షుడు సునీల్ చంద్రారెడ్డి, తెలంగాణ బిల్డర్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ విద్యాసాగర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ 22 శాతం మార్కెట్ వాటాతో గృహ రుణ విభాగంలో 7 ట్రిలియన్ మార్కును చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ఎస్‌బీఐ 23 వేల బ్రాంచ్‌లను పూర్తి చేసుకొని కస్టమర్లకు పూర్తి చేరువలో ఉందన్నారు. ఎస్‌బీఐలో గృహ రుణాలు పొందే వారికి సదావకాశాన్ని ఇస్తుందని, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఐ సీజీఎం హైదరాబాద్ సర్కిల్ రాజేశ్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులను ఆకర్షించేందుకు బిల్డర్లు, డెవలపర్లు పలు రకాల స్కీంలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 150 కి పైగా స్టాల్స్‌ను ప్రదర్శించారు.

కాన్క్లేవ్, ట్రేడ్ ఫెయిర్‌లపై ప్రత్యేక దృష్టి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాసిక్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మధుమతి సర్దేశాయ్

మాదాపూర్, డిసెంబర్ 1: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మహారాష్ట్ర టూరిజం ఆధ్వర్యంలో మహారాష్ట్ర టూరిజం పెవిలియన్, ఐఐటీఎం హైదరాబాద్ 2023 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాసిక్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మధుమతి సర్దేశాయ్ విచ్చేసి అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రవిపాటి, మహారాష్ట్ర ప్రభుత్వ పర్యాటక డైరెక్టరేట్, డాక్టర్ బీఆర్ పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్క్లేవ్, ట్రేడ్ ఫెయిర్‌లపై మహారాష్ట్ర పర్యాటక సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పర్యాటకులు, హోటళ్లు, రవాణాలు మొదలైన వాటితో సహా మొత్తం పర్యాటక సేవలను ఇవి అందిస్తున్నట్లు మహారాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి జయశ్రీ భోజ్ తెలిపారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన 16 ప్రతిష్టాత్మక పర్యాటక సంస్థలు పాల్గొన్నాయి.